కథానిక

# పాపం బాబాయ్



డాక్టర్ ఎ. గోపాలరావు

అందరికీ అన్ని విషయాల్లో అంతగా పట్టింపులు లేకపోవచ్చు గానీ – కొందరికి మాత్రం కొన్ని విషయాల్లో విపరీతంగా పట్టింపులుంటాయి. దీనికి మా బాబాయే సాక్ష్యం. అంటే సాక్షాత్తూ మానాన్న గారి తమ్ముడే ! ఎక్కడ ఏ అచ్చుతప్పు దొర్లినా – ఏ సభలో – కార్యక్రమంలో ఎవరైనా తప్పుగా పదాన్ని అన్నా మరి ఆయన ఊరుకోలేరు. వెంటనే లేచి – అది తప్పు ఇలా అనాలి అని చెప్పడమో – లేదా – కార్యక్రమం అయ్యాక ఆవ్యక్తిని కలిసి – ఆ పదం అలా అనకూడదు ఇలా అనాలి, ఎందుకంటే అంటూ ... క్లాసు తీసుకోకుండా వుండలేరు.

ఇంతకీ మా బాబాయ్ అంత గొప్ప మహాపండితుడేమీ, కాదు. ఆరోజుల్లో అంటే 1940–42 ప్రాంతాల్లో మెట్రిక్ పాసయిన బాబాయ్ – డిగ్రీ చదువుకాదని – విజయనగరం సంస్కృత కళాశాలలో ఉభయభాషా ప్రవీణలో చేరారు. రెండేళ్లయి ప్రిలిమనరీ పరీక్షలు పూర్తి అయేసరికి – ఖుర్దా రోడ్డులో రైల్వేలో పని చేస్తున్న మాతాతగారు చనిపోవడం – అప్పటికే మానాన్నగారు ఉద్యోగంలో వుండడంతో – తాతగారి ఉద్యోగం బాబాయ్‌కిచ్చారు. ఉద్యోగ రీత్యా ఖుర్దారోడ్డు బండముండ – దొంగఘాటి – బిలాస్‌పూర్ ప్రాంతాల్లో పనిచేసినా – గ్రంథాలు చదవడం ఆడపా దడపా ఏదో వ్రాయడం అప్పుడప్పుడు ప్రవాసాంధ్ర కవులుగా పేరున్న వజ్ఝలకాళిదాసు – ములుపేరన్న శాస్త్రి గారి వంటి వారిని కలయడం – బాబాయ్‌కి హాబీలు

రైల్వేలో రిటైర్ అయ్యాక – విజయనగరం వచ్చి స్థిరపడ్డారు. ఒక్కగానొక్క కూతురిని సర్వీసువున్నప్పుడే పెళ్లి చేసేసారు. నాకు బాబాయ్‌కి సుమారు 10 ఏళ్ళు తేడావున్నా – విజయనగరం వచ్చాక కలిసే తిరిగేవాళ్లం. పని ఏమిలేకపోవడంతో తన భాషా – పద ప్రయోగ పాండిత్యాలకు పదును పెట్టారు బాబాయ్. అంతేకాదు – మా వార్డుకి మున్సిపల్ కౌన్సిలర్‌గా కూడా ఎన్నికయ్యారు. బాబాయ్! ఆపదం ఇలా కాదు. ఈ రూపం ఇలా వుండదు అనడం కాదు – వార్డులో రోడ్లు – డ్రయినేజీ లైట్లు – కొళాయినీరు వంటి విషయాలు చూడాలి అని అంటే – సరేలేవోయ్ ! ఇదెన్నాళ్లుంటుందని మోనని అన్నారు.

సరే ! అసలు కథకి వద్దాం.

చెప్పేనుగా చదువుతున్నప్పటి నుంచీ బాబాయ్‌కి తెలుగు భాష – పదాల మీద ప్రత్యేక శ్రద్ధ అని ఆరోజుల్లో వావిళ్లవారి ప్రచురణలు తప్ప మరో పుస్తకాన్ని కొనేవారు కాదు. ఊరికే ఇచ్చినా తీసుకునేవారు కాదు. గొప్ప పండితులతో పరిష్కరించి అచ్చువేయిస్తారా వావిళ్లవారు మిగతా వాళ్లున్నారు చూడు – 'పండితపరిష్కృతం' అంటారే తప్ప ఆపండితులెవరూ డొక్క శుద్ధి వున్నవాళ్లు లేరు. చూడు – ఎంత ఘోరంగా వున్నాయో ! అంటూ రాజమండ్రిలోని ఒకటి రెండు ప్రచురణలను సోదాహరణంగా చూపేవారు.

ఇంతకీ బాబాయ్ పేరు చెప్పలేదు కదూ ! మాతాతగారి నాన్నగారి పేరు పార్వతీశం బక్కపలచగా – వామనవాయనా వుంటారు. ఉద్యోగంలో 'పేంట్లు'వేసినా – రిటైరయి వచ్చాకమాత్రం పంచా – గళ్ల లాల్చీలే ధరించేవారు. బాబాయ్ సభలో వుంటే మాట్లాడే వారికి బెదురే ! ఎక్కడ ఏపదం తప్పుపడతారో అని

ఓ సభలో మాట్లాడుతూన్న వ్యక్తి 'సమిష్టిగా బాధ్యత స్వీకరించాలి 'అనగానే బాబాయ్ లేచి 'సమిష్టి కాదునాయనా – సమష్టిగా' అనాలన్నారు. ఎదుకు బాబాయ్ మీకు అన్నానంతే 'నువ్వుండ హాయ్ పత్రికలవాళ్లు ఈ రోజుల్లో 'సమష్టి'అని రాస్తూ వుంటే వీళ్లెందుకు గుర్తించరు అన్నారు.

కొన్నేళ్ల క్రితం – మా విజయనగరం మహారాజా – పి.వి.జి.రాజు గారి షష్టిపూర్తి ఉత్సవాలు జరిగాయి. పుల్లివీధి – ఆర్యవైశ్య వెల్‌ఫేర్ భవనంలో సభ జరుగుతోంది. వెళ్లాం. 'గౌ.పి.వి.జి.రాజాసాహెబ్ వారి షష్ఠిపూర్తి మహోత్స సభ' అని బేనర్ పెట్టారు. వెంటనే బాబాయ్ – మనని వక్తగా పిలిపించుకుని 'రాజావారి కింకా ఆరేళ్లే ఆయన మరొ అరవై ఏళ్లు జీవించాలి. ఎందుకంటే షష్టిపూర్తి అని కదా వుంది బేనర్‌పై అన్నారు అప్పుడు తెలిసింది ఆర్గనైజర్స్‌కి సభలోవారికి షష్ఠిపూర్తి కాదు షష్టిపూర్తి అనాలని.

అయ్యప్ప కోవెలవాళ్లు ( శ్రీ యనమండ్ర వేణుగోపాలశాస్త్రి గారి ఆధ్వర్యంలో ప్రతిష్ఠ జరుగుతుంది అని వేస్తే శాస్త్రి గారు మహాపండితులయ్యా ఆధ్వర్యం కాదు – ఆధ్వర్యవం అనండి అన్నారు. బాబాయ్ వ్యవహారంలో అది బరువైపోతుంది. అనినేనంటే ఊరుకోవోయి! అసలు శబ్ద స్వరూపం. తెలియొద్దా అన్నారు.

ఓరోజు ఉద్యోగ విజయాలు పౌరాణిక నాటకానికి వెళాం. నాకు భయమే సాధారణంగా ఈ పౌరాణికాల్లో – ఎక్కడో పెద్దనోరు తప్ప – చాలమంది భాషను ఖూనీ చేస్తేస్తారు. బాబాయ్ అని

అనుకున్నట్లే అయింది. భీముడు మాటిమాటికి 'ద్రౌపతి' అనడం అలాగే మిగిలిన వారు రాయభారం అనడం బాబాయ్‌కి వెర్రెత్తింది. ప్రతివాడూ స్టేజిక్కి పోయేవాడే భాష తెలియదు. పద ప్రయోగం తెలియదు అని సణిగేరు. నాటకం పూర్తయింది. గ్రీన్ రూమ్‌లోనికివెళ్లి భీమ పాత్రధారిని పిలిచి ఏంచేస్తున్నావు అన్నారు. సెంకడరీ గ్రేడ్ టీచర్ని మిగతావారా? బి.ఇ.డి సెంకం

డరీ గ్రేడ్ టీచర్లేనండి - చూడునాయనా! ద్రౌపతి కాదు ఇక్కడ పతి పదంగా ప్రయోగంకాదు ద్రుపద రాజుకుతురు ద్రౌపది అవుతుంది. జనక-జానకి- వైదర్భి లాగ అలాగే మిగతావాళతో రాయబారం కాదు అది రాజభార పదానికి వికృతి రాయబారం రాయబారి అనాలి. అచ్చతెలుగులో ఒత్తు అక్షరా లుండవుకదా మాష్టర్లే ఇలా తప్పులంటే ఇక పిల్లల గతేంటి ? అంటూ ఓ లెక్చరిచ్చి వచ్చేరు.

ఇప్పటికి బాబాయ్ స్వరూప స్వభావాలు మీకు తెలిసిపోయాయనుకుంటాను. ఓసారి నేనే ఓ సభ లోనో ఓవ్యక్తిని పరిచయం చేస్తూ మధురవచస్వి విశద యశస్వి అంటూ - బాబాయ్ క్షమించాలి నాకు తెలుసు ఇలా అనకూడదని కానీ శబ్ద సౌందర్యం కోసం అంటున్నాను అని నమస్కారం పడేసాను. లేస్తున్న బాబాయ్ కూర్చున్నారు.

ఆమధ్య హరికథా పితామహ ఆదిభట్ల నారా యణదాసు గారి ఆరాధనోత్సవాలకు వెళ్లాం. ఓ యువభాగవతార్ - దాసుగారి గురించి వర్ణిస్తూ - ఆ వచస్సు, ఆవర్చస్సు, ఆ యశస్సు ఆ మేధస్సు అనే సరికి ఆగునాయనా మేధస్సు కాదు - మేధ అనాలి అంటు లేచి నిలబడ్డారు పాపం ఆయువో యాడు తట్టుకుని తేరుకుని అవును తాతగారూ! ఏదో వరస ప్రాసకోసం అలా వేసేను అన్నాడు.

హనుమజ్జయంతి చేస్తున్నాం ఒక్కొక్కరు రామా యణంలో ఒక్కొక్క కాండపై మాట్లాడేలా వక్తల్ని ఏర్పాటు చేస్తున్నాం. మీరు సుందరకాండ మీద మాట్లాడాలి.అంటూ కార్యనిర్వాహకులు బాబాయ్‌తో అన్నారు. వాళ్లని కూర్చోమని కాఫీ ఇచ్చి చూడండి ఈ సప్తగిరిలో ఏమనివుందో! ఉషశ్రీ సుందరకాండ అని కదా! అంతెందుకు ఆమధ్య సినిమా వచ్చింది. వాళ్లుకూడా సుందరకాండ అనే అన్నారు కదా? మరి మీరు సుందరాకాండ యు దీర్ఘం తీయ్యడం బాగులేదు అని సాగనంపేరు వాళ్లని.

ఎక్కడేనా సుస్వాగతం అని కనబడినా - వినబ డినా - సుస్వాగతం ఏంటి! అగ్గినిప్పులాగ స్వాగతం అంటేనే సు ఆగతం మరో సు ఎందుకు అని ఓ వరస వేస్తారు బాబాయ్.

టీవిలో ఉద్యోగవార్తలు ప్రసారంలో వయోపరి మితి అంటారు అది విన్న బాబాయ్ వెంటనే ఓ కార్డు తీసుకొని వయోపరిమితి కాదు వయఃపరి మితి అనాలంటూ వ్రాసిపడేసారు. హోటళ్లముందు శాఖాహార భోజనశాల అని వుంటే పనికట్టుకుని హోటల్ యాజమానితో శాకాహారమని వుండా లయ్యా అని దిద్దిస్తారు. అలాగే శంఖుస్థాపన అని కనబడితే శంకుస్థాపన అని దిద్దే వరకు ఊరుకోరు.

చివరికి పోస్టల్ అడ్రసు విషయంలో ఇంత జాగ్రత్తగా వుంటారు. మాచిన్న మావయ్య కూర్మ నాథశర్మ గారుండే వారు ఆయనకి గాని

"కొంతమంది వ్యక్తుల తీరు ఒక్కొక్కప్పుడు మనకు 'కచటతపల్లా' కంగారు పెట్టినా, 'గజడదబల్లా' గాభరా పెట్టినా నిశితంగా చూస్తే ఆ వ్యక్తుల్లో వ్యక్తిత్వం సాహిత్యంలో పరిమళంలా ఉంటుంది. ఆఘ్రాణించే శక్తి" మనకుండాలి... అవునా...

మాబాబాయ్ లెటర్ వ్రాస్తే అడ్రసు బట్టి ఇది మాపార్వతీశం బావ ఉత్తరం అని పట్టుకునేవారు మా మమయ్య కారణం ఈయన ఇంగ్లీషులో అయితే kurmanathaఅని తెలుగులో అయితే కూర్మనాథ అని కదుపులో బొట్టుతో వ్రాయడమే!

బాబాయ్ ఎందుకు మరీ చాదస్తం మీకు అని నేనంటే ఊరుకోరా అబ్బాయి అపశబ్దం ఎంత దోషమో భాష్యకారుడు చెప్పెదు శబ్దమే కాదు స్వరం దోషమైనా ప్రమాదమే యథేంద్రశత్రుః స్వరతో పరాధాత్ అన్నాడు అంతేకాదు చక్కగా ఓ శబ్ద స్వరూపాన్ని తెలుసుకొని సరిగ్గా ప్రయోగిస్తే ఎంత మంచిదో ఏకశ్శబ్దం సమ్యక్ జ్ఞాతః - సుష్టుప్రయుక్తః స్వర్గేలోకే కామధుగ్‌భవతి అన్నారని చిన్న ఉపన్యాసం ఇచ్చేరు.

సరే ఇంతటితో ఆగితే అసలు కథే కాదు.

బాబాయ్ విషయంలో ఓ ఘోరం జరిగిపో యింది. అదీ నావల్లే

ఊళ్లో అందికీ తెలుసు బాబాయ్ భాష పదప్ర యోగ విషయం

ఓరోజు ఉదయం ఇంట్లోనే వున్నాం

వార్డులో కొందరు పెద్ద మనుషులు బాబాయ్ కోసం వచ్చేరు. కౌన్సిలరు కదా!

మా వీధి చివర టర్నింగ్‌లో ఖాళీ స్థలం వుంది విశాలంగా అక్కడ ఓ మందిరం లాంటిది కడదా మనుకుంటున్నాం మీరు మునిసిపాలిటీ తరపున అస్థలాన్ని మంజూరు చేయించండి మా సంఘానికి అన్నారు. వచ్చినవాళ్లు.

బాబాయ్ ఓ నిముషం కళ్లుమూసుకుని నిజమే మీరు చేద్దామన్న పని మంచిదే పూర్వం రోజుల్లో అయితే అదేమీ అసాధ్యం కాదు. కానీ ఇప్పుడు రూల్సు చాలా బిగుసుకున్నాయి. రోడ్లు వెడల్పు చేసే కార్యక్రమంగా ఆస్థలంలో కట్టడాలేమీ కూడ దంటున్నారు. కాబట్టి ఇప్పటికి దుస్సాధ్యం అని ఇంకా ఏదో చెప్పబోతున్న బాబాయ్ మాటలకు బ్రేక్ వేస్తూ బాబాయ్ దుస్సాధ్యం కాదు-దుస్సాదం అనాలి అన్నాను. అప్రయత్నంగా వచ్చేసిందామాట

ఎదురుగా వున్న వారందరూ అమ్మయ్య ఇప్పటికి పార్వతీశంగారి మాటకు తప్పుపట్టే వారు దొరికేరు అన్నారు.

అంతే ! పాపం బాబాయ్ అవాక్కయి పోయారు. ముఖం చిన్నబోయింది. వంచిన తల ఎత్తలేదు.

పాణినీయం ప్రకారంగా అసాధ్యం అనడం కానీ దుస్సాధ్యం సుసాధ్యం అనకూడదు దుస్సాధం - సుసాధం అనాలి ఇదీ బాబాయ్ చెప్పిందే !

తరువాత ఎంత విచారించేనో! కానీ ఏంలాభం! అప్పటి నుంచీ బాబాయ్ స్వభావమే మారిపోయింది.

